మానవ సంబంధాలు
ఆర్థిక బంధాలుగా
మారినప్పుడు
అతనికి
తెలిసిన నిజం!

# వినుమా వేదన

ఇ. మురళీ మోహనరావు కథ

ఆఫీసునుండి ఇంటికి రాగానే ఒక కవరు అందించింది శిరీష.

''ఎక్కడినుంచి?'' చించుతూనే అడిగాను.

''ఏమో చూడండి'' అన్నది శిరీష.

''తమ్ముడి దగ్గరనుంచి'' అంటూ ఉత్తరం చదివి శిరీషకిచ్చాను.


''ఎల్లుండి తమ్ముడు, మరదలు గోదావరికి వస్తున్నారట. స్టేషన్‌కు రమ్మని రాశాడు'' అన్నాను ముభావంగా.

''అదేంటి? మీ తమ్ముడు మరదలు వస్తున్నారంటూ అలా మారిపోయారు?'' ఆశ్చర్యంగా అన్నది శిరీష.

నా మనోభావాలు ఆమెకు అర్థంకావు. ఎమ్మేవరకు చదివి సరైన ఉద్యోగం రాక, తల్లిదండ్రుల పోషణలో బ్రతకలేక ఏదైనా బ్రతుకుదెరువు చూసుకుందామని కొత్త భార్య శిరీషతో రెండు సంవత్సరాల క్రితం హైదరాబాదులో కాపురం పెట్టాను.

రాజధానికి రావడం మా ఇద్దరి జీవితాల్లో అదే తొలిసారి. ఏదో చిన్న కంపెనీలో గుమాస్తా ఉద్యోగం దొరికింది. ఏనాటికైనా లెక్చరర్ కావాలనేది నా అభిలాష. అన్ని ప్రయత్నాలు చేస్తున్నాను. అదృష్టం కలసి రావడంలేదు.

స్వగ్రామంలోనే వుండి పొలం పనులు చూసుకోమని నా తండ్రి ఎంతో బ్రతిమలాడాడు. కాస్తో కూస్తో ఆస్తి వుంది. తిని కూర్చున్నా ఢోకా లేదు. కానీ అలా బ్రతకడం నాకిష్టం లేదు. స్వయం కృషిమీద అధిక నమ్మకంతో ఆస్తిలో నాకు చిల్లిగవ్వ అక్కర్లేదని చెప్పి భార్యను తీసుకుని వచ్చాను.



వచ్చేటప్పుడు నా తండ్రి ఒక మాట చెప్పాడు ''నీకు అక్కడ జరుగుబాటుమీద ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే వచ్చెయ్. ఇబ్బందులు మాత్రం పడవద్దు. ఇల్లాలిని కష్టపెట్టద్దు'' అంటే అర్థం భార్యచేత ఉద్యోగం చేయించవద్దనే.

కాలం ఎంత మారుతున్నా మా వంశంలో చాదస్తాలు మారలేదు. స్త్రీలు ఇంటి పనులు చూసుకోవాలి. మగవాడు సంపాదనా వ్యవహారాలు చూసుకోవాలి. భార్యలను ప్రేమగా

చూసుకోవాలి. స్త్రీలు భర్తలపట్ల అనురాగంతోపాటు వినయ విధేయతలు కనపరచాలి. భర్తతో ఒదిగిపోవాలేకానీ ఎదిగిపోకూడదు.

చాదస్తం అనుకోండి ఏమైనా అనుకోండి. నాకూ ఆ భావాలు బాగా జీర్ణించుకుపోయాయి.

సరైన జాబ్ లేని కారణంగా నేను ఇంకా జీవితంలో స్థిరపడనట్లే లెక్క. చేతిలో డబ్బు ఆడదు. ఏ క్షణానికాక్షణం లెక్క చూసుకోవలసిన పరిస్థితి.

ఇటువంటి స్థితిలో ఉన్నప్పుడు బంధువులెవ్వరైనా వస్తున్నారంటే నాలాంటివాడికి గుండె దడదడలాడడం సహజమే.

''ఖర్చు ఎలా తట్టుకోవాలా అని ఆలోచిస్తున్నాను. తమ్ముడు పెళ్లయిన తరువాత మొదటిసారి భార్యతో వస్తున్నాడు. మనం కాపురం పెట్టిన తరువాత రావడంకూడా వాడికిదే ప్రథమం'' అన్నాను.

''అది నిజమే. తోడికోడలు తొలిసారిగా వస్తోంది. ఏదైనా మంచి చీర పెట్టకపోతే బాగుండదు'' అన్నది శిరీష.

గుండెకాయ తెగి గర్భంలో పడ్డట్లయింది నాకు. కారణం లేకపోలేదు.

తమ్ముడు నాకంటే ఒకింత ఎక్కువే విద్యార్హతలు కలిగినవాడు. పైగా అదృష్టంకూడా కలిసివచ్చి గవర్నమెంటు కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం సంపాదించాడు. చిన్న వయసులోనే వాడికలాంటి ఉద్యోగం రావడంతో మా ఆనందానికి అవధులు లేవు. తమ్ముడిని అభినందిస్తూ ఉత్తరం రాశాను.

ఆ తరువాత నాలుగు నెలలకు మా నాన్ననుంచి నన్ను అర్జంటుగా రమ్మని టెలిగ్రాం వచ్చింది. ఏం జరిగిందోనని కంగారుపడుతూ ఆఘమేఘాలమీద వెళ్లాను.

''వాడికి పోయేకాలం వచ్చింది. ఉద్యోగం చేసే అమ్మాయిని పెళ్లిచేసుకుంటాడట. మన వంశంలో ఇలా ఎప్పుడైనా జరిగిందా?'' ఆగ్రహంతో అన్నాడు మా నాన్న.

నిర్ఘాంతపోయాను.

''అదేవిట్రా? అంత అవసరం ఏమొచ్చింది? నీకున్న ఉద్యోగం చాలదూ?'' అన్నాను.

''అన్నయ్యా నువ్వైనా అర్థం చేసుకో. అరుణ చాలా మంచిపిల్ల. మంచి ఉద్యోగం. ఇద్దరూ ఉద్యోగస్థులైతే ఆర్థిక పరిస్థితి ఎంతో మెరుగ్గా వుంటుంది. గవర్నమెంట్ జాబ్ కాబట్టి ఇద్దరం ఒకే చోట ఉండే అవకాశం వుంది. కాలానుగుణంగా పద్ధతులు మార్చుకోకపోతే ఎలా?'' అన్నాడు తమ్ముడు.

''తమ్ముడూ. నువ్వు చెప్పేది నిజమే. కానీ ఇద్దరూ ఉద్యోగాలకు వెళితే ఇంటి వ్యవహారాలు ఎవరు చూస్తారు? పిల్లల ఆలనా పాలనా చూసేదెవరు? మన వంశంలో స్త్రీలు సంపాదనకు వెళ్లడం ఎన్నడైనా జరిగిందా? మనిషికి తృప్తి ముఖ్యం. అదృష్టం కొద్దీ నీకు మంచి ఉద్యోగమే వుంది. నీకేమీ బరువు బాధ్యతలు లేవు. ఇల్లాలిని ఇంటి దీపంగానే వుంచాలిగానీ వీధి దీపాన్ని చేయరాదు'' అన్నాను.

''క్షమించు అన్నయ్యా. నేను భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నాను. నువ్వీ విధంగా మాట్లాడతావనుకోలేదు'' అన్నాడు.

''ఉద్యోగం రాగానే నువ్వో పెద్ద మొగాడినయ్యాననుకుంటున్నావన్నమాట! నిర్ణయాలు తీసుకుని మాకు తెలియజేస్తున్నావన్నమాట! నిన్నటిదాకా నేను ఇంట్లోకి వస్తున్నానంటే భయపడుతూ గదిలోకి పరుగెత్తే నువ్వు సంపాదనాపరుడవు కాగానే పెద్దవారిని ఎదిరించేవాడివయ్యావన్నమాట. ఇదేనా నీ సంస్కారం?'' గయ్‌మని లేచాడు నాన్న.


నాన్న ముఖంలో కోపాన్ని చూడడం దాదాపు అదే మొదటి సారి. కళ్లు చింతనిప్పులా తయారై ఆగ్రహావేశాలతో ఊగిపోతున్నాడు. కొడుకు ఉద్యోగస్థురాలిని పెళ్లిచేసుకుంటున్నాడనే విషయంకంటే తన మాటకు ఎదురుచెబుతున్నాడనే బాధ ఎక్కువగా కనిపిస్తున్నది ఆయన ముఖంలో.

తమ్ముడు ఏమీ మాట్లాడకుండా విసురుగా నిష్క్రమించాడు. ఎవ్వరు కాదన్నా ఔనన్నా ఆ అమ్మాయిని పెళ్లిచేసుకుని తీరాలనే నిర్ణయానికి వచ్చేశాడని అర్థమైంది.

వాడి ఆశలు వాడివి. వాడికి ఆడంబరమైన జీవితం మీద మోజు జాస్తి. రెండు జీతాలతో విలాసంగా బ్రతకాలనేది వాడి కోరిక. అందులో తప్పేమీ లేదు.

ఇల్లాలిని కూడా డబ్బు సంపాదించే యంత్రంగా మార్చిన కాలంలో పుట్టాడు. ఉద్యోగం చేసే భార్య అయితే భార్య సంపాదన మీద తప్ప భార్యమీద ప్రేమ వుండదు మగవాడికి. ఒకటో తారీఖు సాయంత్రం భార్యనడిగే మొదటిప్రశ్న 'నీ జీతం వచ్చిందా?' అనే.

''ఈరోజు తీసుకోలేదు'' అంటే అతని ముఖం పూర్తిగా మారిపోతుంది. ఆ రాత్రి అతనికి నిద్రపట్టదు. భార్య పీక



పిసికివెయ్యాలన్నంత కోపం వస్తుంది. ఇవాళ కాకపోతే రేపు వస్తుందికదా అన్న విషయమే స్ఫురణకు వుండదు.

భార్యకూడా సంపాదిస్తుంది కాబట్టి భర్తకూడా కొంత స్వతంత్రాన్ని కోల్పోక తప్పదు. ఏమే, ఒసే, ఓయ్ లాంటి పిలుపులు ఉపయోగిస్తే ఆమె సహించదు. వెంటనే ''ఏంటిరా?'' అంటుంది. ఎవరో ఒకరూ అరా వుంటారేమోకాని సంపాదించే భార్యవద్ద సంప్రదాయమైన వినయ విధేయతలు ఆశించడం పేరాశే.

మా భయమూ అదే. ఇంతవరకూ మా కుటుంబాలలో భర్తలను ఎదిరించి భార్యలు లేరు. భార్యలను కష్టపెట్టిన భర్తలూ లేరు. భార్యాభర్తల మధ్య కలహం అన్న మాటకు తావే లేదు. అటువంటి పరంపరలో సంపాదించే భార్యతో తమ్ముడు వేగలడా అనేదే మమ్మల్ని వేధిస్తున్న విషయం. పైగా తమ్ముడుకూడా కొంచెం కోపధారి. చిన్న మాటనుకూడా తేలికగా తీసుకోలేడు. వాడి తెలివితేటలకు తోడు కొంచెం శాంత స్వభావం వుంటే వాడు ఋషితుల్యుడే.

''నాన్నా. మనమే కొంచెం తలవంచడం మంచిది. వాడి వరస చూస్తుంటే మనలను కాదని బయటకు వెళ్లిపోయి పెళ్లి చేసుకునేలా వున్నాడు. అలా జరిగితే మన పరువు ప్రతిష్ఠలు బజారుకెక్కడం మినహా ప్రయోజనం లేదు'' అన్నాను.

''అందుకని! ఈ అప్రాచ్యపు చేష్టల్ని సహించమంటావా? నా బొందిలో ప్రాణం వుండగా జరగదీపని'' అన్నాడు నాన్న.

నాన్న ఆవేశం తగ్గిన తరువాత మాట్లాడదామని సంభాషణ అంతటితో ముగించాను.

తమ్ముడు సాయంత్రం భోజనాల వేళకు వచ్చాడు.

''నాన్నా. మధ్యాహ్నం ఆవేశంగా మాట్లాడాను. క్షమించు. నిన్ను ఎదిరించాలని కాదు. మనం లక్షాధికారులంకాదు. భవిష్యత్తులో దేనికి లోటు కలిగినా ఆర్థిక పరిస్థితికి లోటు రాకూడదనే నా కోరిక. ఇద్దరం కలిసి పనిచేసుకుంటూ ట్యూషన్స్ చెప్పుకుంటూ చీకూచింతా లేకుండా బ్రతకాలనేదే నా ఆశ. మీరు భయపడే విషయం నాకు తెలుసు. అలాంటి పరిస్థితి వస్తే మీ కొడుకు చనిపోయినట్లే లెక్క'' అన్నాడు.

అంతవరకూ పొయ్యిమీది పులుసులా తుకతుకలాడిపోతున్న నాన్న తక్కున చల్లారిపోయాడు.

మరి కన్నవారంటే అదే! పది హత్యలు చేసి ఉరికంబం ఎక్కబోతున్న వ్యక్తిని చూసి భార్యాపిల్లలు అసహ్యించుకోవచ్చు. కానీ తల్లిదండ్రులు భోరున విలపిస్తారు.

అదే అదనుగా భావించి నేను కల్పించుకున్నాను.

''నాన్నా. మనం ఆలోచించవలసింది మన కోణంనుంచి కాదు. తమ్ముడి కోణంనుంచి. వాడేమీ పిల్లవాడుకాదు. అఖండ ప్రజ్ఞావంతుడు. సరస్వతీ కటాక్షం పొందినవాడు. మంచి చెడులు ఆలోచించగల శక్తిమంతుడు. దానికితోడు మీ

అండదండలున్నాయి. సతీసహగమనం ఒకప్పుడు సదాచారం. నేడు దాన్ని నిషేధించాం. అంటరానితనం ఒకప్పుడు సంప్రదాయం. నేడు దాన్ని త్యజించాం. వితంతు వివాహాలు ఒకప్పుడు అనాచారం. నేడది ఆదర్శప్రాయం. కాలంతోపాటు అభిప్రాయాలు మార్చుకోకపోతే పెద్దరికానికి అర్థం లేదు. ఏమంటావు?'' అన్నాను. నాన్న కోపం ఎప్పుడో గాలికి ఎగిరిపోయింది. మౌనంగా తలాడించాడు. తమ్ముడు నావైపు కృతజ్ఞతగా చూశాడు.

అరుణతో తమ్ముడి వివాహం వైభవంగా జరిగింది. అందరం సంతోషించాం.

కానీ ఆ ఆనందం ఎంతోకాలం నిలబడలేదు. మూడు నెలల లోపే వారి కాపురంలో అపశృతులు దొర్లాయి. భర్తను గౌరవిస్తూ, ఆయన అడుగులకు మడుగులొత్తాలనుకునే సగటు మహిళకాదు అరుణ. తానుకూడా భర్తతోపాటు సమానంగా చదువుకుని, సమానంగా సంపాదిస్తున్నాను కాబట్టి భర్త తనకంటే గొప్పవాడేమీ కాదనేది ఆమె అభిప్రాయం. ముఖ్యంగా తాను సంపాదిస్తున్నాను కాబట్టి ఏ సంపాదనా లేని అత్తమామలు తన చెప్పుచేతల్లో పడి వుండాలని ఆమె అభిమతం.

ఒకరోజు తనముందే మామగారిని తుస్కారించి మాట్లాడడంతో తమ్ముడు తీవ్రాగ్రహం చెంది భార్యను చితకబాదాడు. దాంతో అరుణ అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది.

నెలలు గడిచినా తిరిగి రాలేదు సరికదా, తల్లిదండ్రులుకూడా అరుణనే సమర్థించి అల్లుడి వద్దకు తమ కూతురును ఛస్తే పంపమని, కావాలంటే విడాకులివ్వగలమని కబురు పంపించారు.

దాంతో తమ్ముడు కృంగిపోయాడు. తను కన్న కలలు ఇంత త్వరగా భగ్నమౌతాయని వాడు ఊహించలేదుకానీ అనుభవంతో ఊహించిన మాకు ఆశ్చర్యం కలిగించలేదు.

తమ్ముడిని తిట్టిపోశాడు నాన్న.

''ఆలి సంపాదనకాశపడుతూ దాన్నే

## పొరపాటు

''నేను పెళ్లికి ఒప్పుకోవడం పెద్ద పొరపాటు అయింది దేవుడోయ్'' లబోదిబోమంది కాంతం.

''ఏమయిందే? మంచి ఉద్యోగంకూడా చేస్తున్నాడన్నావ్?''

''ఆ... మరే మిలిట్రీలో జవాన్ ఉద్యోగం అని తర్వాత తెలిసింది బాబోయ్''

- చుక్కల గోపీచందర్ (మహబూబాబాద్)



కొడతావురా పశువా? నీకంటే నీ పెళ్లాం ఎందులో తక్కువ? నీలాగే తనూ కష్టపడుతున్నది. తను తిరిగి కొడితే నీ ముఖం ఎక్కడ పెట్టుకుంటావు?'' అరిచాడు.

''మన కుటుంబంలో పెద్దవాళ్లకు ఎదురుచెప్పడమనేది ఏనాడైనా వుందా? నాన్నపట్ల అవిధేయతగా ప్రవర్తించినందుకు కొడితే నాన్న నన్నే తిట్టిపోస్తున్నాడు'' అన్నాడు తమ్ముడు.

ఏం మాట్లాడాలో అర్థంకాలేదు నాకు. తను గౌరవం చూపించవలసిన తండ్రి. ఇటు తన పట్ల గౌరవం చూపించే తమ్ముడు!

''హు... ఇప్పుడు గుర్తొచ్చాయా నీకు కుటుంబ మర్యాదలు! ఒక మర్యాదను తుంగలో తొక్కినప్పుడు మిగిలిన మర్యాదలుకూడా మార్చుకోవలసి వస్తుందని తెలియదూ? చదువుకున్నావుగదురా బోడి చదువు'' తీవ్రాగ్రహంతో అరిచాడు నాన్న.

''నాన్నా... జరిగినదానిని గురించి మనలో మనం ఘర్షణ పడడం అవివేకం. ఈ సమస్య సరిదిద్దే మార్గం చూడు'' అన్నాను.

''వెళ్లి పెళ్లాం, అత్తమామల కాళ్లు పట్టుకుని పెళ్లాన్ని తెచ్చుకోమను. నువ్వే అన్నావుగా వాడు ప్రజ్ఞావంతుడు, శక్తిమంతుడు అని. వాడి ప్రజ్ఞ ఏమిటో నిరూపించుకోమను'' అని నాన్న బయటకు వెళ్లాడు.

ఈ విషయంలో మధ్యవర్తులకు జోక్యం కల్పించి మా పరువు మర్యాదలు వారి చేతుల్లో పెట్టడం నాకు ఇష్టంలేదు. అందువలన నేనే స్వయంగా తమ్ముడి మామగారింటికి వెళ్లాను.

వాళ్లు నా పట్ల ఎంతో నిర్లక్ష్యంగా మాట్లాడారు. అత్తమామలకు సేవలుచేస్తూ, ఇంటెడు చాకిరీ చేస్తూ ఒక మగవాడి మోచేతులకింద బ్రతకవలసిన అవసరం తమ కూతురుకు లేదన్నారు. రాత్రింబగళ్లు తమ కూతురు కష్టపడి చదివి, రెక్కలు ముక్కలు చేసుకుని నెలకు నాలుగువేలు సంపాదిస్తున్నది మరొకరి జీవితాలకోసం ధారపోయడానికి కాదన్నారు. కావాలంటే మొగుడు, పెళ్లాం వేరేగా వుండి తమ సంసారం తాము చేసుకుంటామంటే కుమార్తెను పంపుతామన్నారు. కాదనుకుంటే విడాకులు తీసుకోమని ఖరాఖండిగా చెప్పేశారు.

సంపాదించే భార్యను వదులుకోవడానికి తమ్ముడు సుతరామూ ఇష్టపడలేదు. చేసేదిలేక మా అందరి సలహామీద తమ్ముడు వేరుకాపురం పెట్టుకున్నాడు.

మరదలు చీటికి మాటికి తమ్ముడితో ఘర్షణ పడుతుంటుందని, వారి సంసారంలో ఆప్యాయతానురాగాలు గగనకుసుమాలయ్యాయని వార్తలు వస్తుంటాయి.

ఆ తరువాత నేనెప్పుడూ వారిని చూడలేదు. తడవతడవకు బోలెడంత బస్సు చార్జీలు పెట్టుకుని రాకపోకలు చేయడం నా పరిస్థితికి ఏమాత్రం అనుకూలం కాదు.

ఇన్నాళ్ల తరువాత ఇద్దరూ వస్తున్నారన్న ఆనందంకంటే ఈ అదనపు ఖర్చునెలా తట్టుకోవాలన్నదే నా ఆలోచన!

''చీర పెట్టకపోతే తమ్ముడు ఏమీ అనుకోడులే' అన్నాను.

శిరీష నవ్వింది.

''అంటే ఏమీ అనుకోరుగా. ఇంకా చిన్ననాటి తమ్ముడే అనుకోవద్దు. ఎవరైనా పుడుతూనే అన్నదమ్ములు. పెరిగిన తరువాత దాయాదులే. ఒకవేళ మీ తమ్ముడు అన్యధా భావించకపోయినా మరదలు మాత్రం కచ్చితంగా అనుకుంటుంది. ఆడవాళ్ల మనస్తత్వాలు నాకు బాగా తెలుసు'' అన్నది.

రైల్వేస్టేషన్‌కు వెళ్లి తమ్ముడిని, మరదల్ని తీసుకువచ్చాను. ఇద్దరూ బాగా ఖరీదైన బట్టలు ధరించారు. పోచంపల్లి పట్టుచీరలో మరదలు మెరిసిపోతున్నది. పెళ్లినాటికంటే మరికొంచెం అందంగా కనపడుతున్నది.

శిరీష చాపవేసింది. మమ్మల్ని చూస్తున్న ఆనందం తమ్ముడిలో స్పష్టంగా కనపడుతున్నది. ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడు.

''ఏమిటి బావగారూ. కనీసం రెండు కుర్చీలుకూడా కొనలేదా?'' అడిగింది అరుణ.

''లేదమ్మా. కొంటే ఒకేసారి అరడజను కొనాలని ఆగాము'' జవాబిచ్చాను.

మంచినీళ్లు తాగుతూ ముఖం అదోలా పెట్టి ''అబ్బ... ఈ నీళ్లు ఎలా తాగుతున్నారు బావగారూ. అసలే ఎండాకాలం కదా! ఫ్రిజ్ కొనకూడదా?'' అన్నది.

తమ్ముడు ఇబ్బందిగా చూశాడు.

''ఒకటేమిటమ్మా? మొన్ననే పది రూపాయలు పెట్టి రెండు బుల్లి ఫ్రిజ్‌లు కొన్నానే! చల్లగాలేవా?'' ఆశ్చర్యంగా అన్నాను.

''ఓహో! మట్టి ఫ్రిజ్‌లా?'' నవ్వుతూ అన్నది అరుణ.

''కొన్నాళ్లాగు. మా అన్నయ్య అసాధారణ మేధావి. ఒక్క ఫ్రిజ్జేమిటి? మేడలు కడతాడు. వాడు ఒక పద్యం చదివితే చాలు. లక్షలు కురుస్తాయి'' అన్నాడు తమ్ముడు ఉక్రోషంతో.

''అబ్బో... అప్పుడే అన్నగారి పక్షం వహించేస్తున్నారు. నేనేమీ బావగారిని మింగేయడంలేదులే'' అన్నది అరుణ.

సాయంకాలం టీవీ చూస్తూ ''ఏంటి

## రాజకీయ నియంత్రణ

శివసేన అధ్యక్షుడు బాలథాకరేను ఈ మధ్య ఓ జర్నలిస్టు మీ పార్టీ లో పేరుపొందిన నాయకులు తక్కువమంది ఎందుకు ఉన్నారని అడిగినప్పుడు ''శివసేన నా కుటుంబం. మేము కుటుంబ నియంత్రణ పాటిస్తాం. మా కుటుంబానికి ఒకరిద్దరు నాయకులు చాలు... అప్పుడే మా పార్టీ మంచిగా వుంటుంది'' అంటూ వివరణ ఇచ్చారు థాకరే! దటీజ్ శివసేన!!



- జూపిటర్

బావగారూ! డబ్బులన్నీ ఏ బ్యాంకులో వేస్తున్నారు? మంచి కలర్ టీవీ కొనకూడదా? పల్లెటూర్లో వుండి మేము చూస్తున్నామే!'' అన్నది.

నా మనస్సు కొంచెం చివుక్కుమన్నది. ఏమిటీ అమ్మాయి ఇలా మాట్లాడుతున్నది? మా పరిస్థితి తెలిసి మాట్లాడుతున్నదా? తెలియక మాట్లాడుతున్నాదా? నేను సమాధానం ఇవ్వలేదు.

రాత్రిపూట వంటగదిలో మేము పడుకుని ముందుగదిలో తమ్ముడికి, మరదలికి చాపలు వేశాము.

''చీర సంగతి ఏం చేశారు?'' అడిగింది శిరీష.

''నలుగురైదుగుర్ని అడిగి చూశాను. నెలాఖరుకదా! ఎవ్వరి దగ్గరా డబ్బులాడడంలేదు'' అన్నాను.

''ఒట్టి చేతులతో పంపిస్తే బాగుండదు. మీ ఇష్టం'' అని పడుకుంది శిరీష.

కనీసం మూడు వందలన్నా లేకపోతే మంచి చీరరాదు. అప్పులు చెయ్యడం అలవాటు లేదు. ఏం చెయ్యాలో తోచక నిద్రపట్టలేదు.

అర్ధరాత్రి తమ్ముడి గదిలోంచి సన్నగా అరుపులు వినిపిస్తున్నాయి. పెద్దగా సవ్వడి లేకపోవడం మాటలు స్పష్టంగా వినపడుతున్నాయి.

''మా అన్నయ్యతో నువ్వు అలా మాట్లాడి వుండవలసిందికాదు. ఆయన మాకు ఎంతో గౌరవనీయుడు''

''నేనేమన్నాను? ఇంతలోనే ఏం పొడుచుకొచ్చింది?''

''మా అన్నయ్యతో మేమే అలా మాట్లాడం. నీ మాటలకు ఆయన నొచ్చుకున్నాడు''

''అబ్బో... మీ అన్నయ్య ఏమైనా మినిస్టరా? గవర్నరా? మనిషితో మాట్లాడడంకూడా తప్పేనా?''

''నోర్ముయ్ ఎదుటి వ్యక్తిని గౌరవించాల్సింది అతని వ్యక్తిత్వాన్నిబట్టి. హోదానుబట్టికాదు''

''హు! మీరేం నాకు నీతులు చెప్పక్కర్లేదు. మీ వినయాలు, గౌరవాలు నాకవసరంలేదు. కట్టుకున్న పెళ్లానికి ఒక మంచి చీర కొనిపెట్టలేని మీ అన్నయ్యకూడా ఒక మనిషే!''

''ఛీఛీ... నువ్వు మనిషివికావు...''

ఇక నాకు వినాలనిపించలేదు. మా తమ్ముడు జీవితంలో ఏమి పోగొట్టుకున్నాడో నాకర్థమైంది. ఆలుమగల మధ్య అనురాగం లేనప్పుడు ఆ జీవితం ఎంత దుర్భరం!

మర్నాడు తమ్ముడు, మరదలు ఏమీ జరగనట్లే ప్రవర్తించారు. నేను బయటకు వెళ్లేటప్పుడు చీర విషయం మళ్లీ గుర్తుచేసింది శిరీష.

ఐదు సంవత్సరాల క్రితం మా మామగారు పెళ్లి సందర్భంగా ప్రెజెంట్ చేసిన రిస్ట్‌వాచీ మార్వాడి కొట్టుకుపోయింది. సాయంకాలం చీరతో ఇంటికి వచ్చాను.

మరునాడు పొద్దున్న తమ్ముడు, మరదలు బయలుదేరారు. బొట్టు పెట్టి చీర ఇచ్చింది శిరీష.

''ఇప్పుడెందుకన్నయ్యా. దానికి బోలెడు చీరలున్నాయి'' అన్నాడు తమ్ముడు.

''భలేవాడివి తమ్ముడూ. మొదటిసారిగా మరదలుపిల్ల వచ్చింది. ఆమాత్రం చీర పెట్టకపోతే బావగారు చులకనైపోరూ?'' అన్నాను నవ్వు పులుముకుని.

బస్టాండుదాకా సాగనంపి వచ్చాను.

నెలరోజుల తరువాత ఆస్తి పంపకాల విషయమ్మై మా ఊరు వెళ్లాల్సి వచ్చింది. పనులన్నీ అయిపోయిన తరువాత తమ ఇంటికి వచ్చి రెండురోజులుండమని తమ్ముడు ఆహ్వానించాడు. తప్పనిసరై వెళ్లాను.

కొత్తగా కట్టుకున్న ఇల్లు ఎంతో అందంగా వుంది. ఆధునిక జీవితానికి నిర్వచనంగా నిలుస్తున్న వస్తువులు అన్నీ వున్నాయి. జీవితం దర్జాగా సాగుతున్నదని అర్థమౌతున్నది.

టిఫిన్ చేసిన తరువాత తమ్ముడు, మరదలు కాలేజీకి వెళ్లారు. నేను పుస్తకం చదువుకుంటూ వరండాలో పడుకున్నాను. ఇంతలో చాకలి అమ్మాయి వచ్చింది. ఆమె కట్టుకున్న చీర మేము మరదలికి పెట్టింది! మరదలు కట్టుకునే చీర ఆమె కట్టుకునేసరికి నాకు ఆగ్రహం వచ్చింది.

''మా మరదలు కట్టుకునే చీర నువ్వు కట్టవచ్చా?'' అడిగాను.

''భలేవారండీ... ఆమెగారి చీరలు నేను కట్టడమా? ఆవిడే దీన్ని నా ముఖాన కొట్టింది'' కిలకిలా నవ్వుతూ అన్నది.

''నీకెందుకిచ్చింది?'' కోపంగా అన్నాను.

''నాకేం తెలుసు? మొన్న హైదరాబాదు వెళితే ఎవరో దరిద్రులు పెట్టారు. ముష్టి మూడు వందల రూపాయల చీర నేను ఏనాడైనా కట్టానా? అని నాకిచ్చింది. మీకు తెలయదేమోకానీ మా అమ్మగారు వెయ్యి రూపాయలకు తక్కువ చీర కట్టరు. పనిమనుషులకు కూడా ఐదారు వందల రూపాయల చీరలు కొనిపెడుతుంది....''

నరాలన్నీ బిగుసుకుపోయి ముఖం జేవురించింది నాకు.

★ ★ ★

